నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 21 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బడ్జెట్ 2025-26

గ్యారెంటీలు ఫోయిందా!



❖ రూ.2500 ఎప్పుడిస్తరు?

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తమన్నరు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నది. ఇప్పటివరకు ఆ ఊసే లేదు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి నయా పైసా కేటాయించలేదు. అంతేకాకుండా ఇప్పటికీ కేసీఆర్ ఇచ్చిన పింఛన్లే వస్తున్నాయి. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు చేయూత ద్వారా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పిన్రు. దీనిపై కూడా బడ్జెట్‌లో మాట్లాడలేదు. అంటే ఈ ప్రభుత్వానికి మహిళలపై ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నది. ఆరు గ్యారెంటీల పేరిట మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే అన్ని ఎన్నికల్లో మహిళలు తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

- శిరీష, మహాలక్ష్మి పథకానికి అర్హురాలు, నిర్మల్.మండలం

❖ మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిర్పూర్(యూ), మార్చి 20: కాంగ్రెసోల్లు పేద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామంటే ఎంతో సంబుర పడ్డాం. నెలకు రెండున్నర వేలు వస్తే పిల్లలను పోషించుకోవడానికి, ఇంట్ల అవసరాలకు ఉపయోగపడుతాయని మురిసిపోయిన. కానీ ఈ మాట మహిళలను ఆదుకోవడానికి కాదు.. ఆ మాటలన్నీ మా ఓట్లు లాక్కోవడానికి అని అర్థమవుతున్నది. గవర్నమెంట్‌లకు వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇచ్చిన మాట గుర్తుకు రావడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

- గేడం లక్ష్మి, గృహిణి, సిర్పూర్(యూ)

కేసీఆర్ ఇచ్చిన రూ.2016 వస్తున్నాయి..

సిర్పూర్(యూ), మార్చి 20: మా అమ్మకు వయస్సు అయిపోయింది. ఇంట్లోనే ఉంటుంది. ప్రతి నెల ఆమెకు దవాఖాన ఖర్చులు, మందుల ఖర్చుల వుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు ముసల్లోళ్లకు రూ.4000 పింఛన్ ఇస్తాం అని అంటే అందరం నమ్మినం. పింఛన్ పెంచితే మా అమ్మ ఖర్చులకు ఎంతో ఉపయోగపడతాయి అనుకున్న. గవర్నమెంట్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర అవుతున్నది. ఇప్పటికీ పింఛన్ పెంచలేదు. కేసీఆర్ ఇచ్చిన రూ.2016 మాత్రమే ఇస్తున్నరు. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పింఛన్ పెంచదు.. వాళ్లు మాకు ఇవ్వరని అర్థమైంది.

-పుర్క సురేశ్, సిర్పూర్(యూ)

అసెంబ్లీలో భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనిపించని ప్రస్తావన

- హామీల అమలుపై చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు
- మోసం చేసిన సర్కారుపై మండిపడుతున్న సబ్బండ వర్గాలు

మంచిర్యాల, మార్చి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరు గ్యారెంటీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. నిన్న(బుధవారం) ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రస్తావనే కనిపించకపోవడంపై రైతులు, వృద్ధులు, మహిళలు, సబ్బండ వర్గాలు మండిపడుతున్నాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500పై ప్రభుత్వ పద్దులో కనీస ప్రస్తావన లేదు. ఆడవాళ్లకు అందుతున్న ఏకైక ఉచిత బస్సు రవాణాకు నిధులు తగ్గించింది. గృహజ్యోతి పథకం కింద ఇస్తున్న ఉచిత కరెంటుకు దాదాపు రూ.350 కోట్లకు కోత పెట్టింది. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ చాలా మందికి రావడం లే దు. ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి ఎక్కువ నిధులు ఇస్తారనుకుంటే గతంలో ఎంతైతే ఇచ్చారో ఇప్పుడూ అంతే ఇచ్చారు. దీంతో అన్ని రకాలుగా అర్హులై ఉండి రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం ఎదురు చూ స్తున్న కొత్తవారికి ఇక సబ్సిడీ సిలిండర్ ఇవ్వమని చెప్పకనే సర్కారు చెప్పింది. ఇక కాంగ్రెస్ గెలిస్తే రూ. 2వేల వస్తున్న పింఛన్ రూ.4వేలకు వస్తుందని ఆశ పడిన వృద్ధులు, ఒంటరి మహిళలు, ఇతర పింఛన్‌దారులను మరోసారి సర్కార్ మోసం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పింఛన్‌దారులకు రూ.4 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలంటే రూ.27 వేల కో ట్లు అవసరం అవుతాయి. కానీ.. రూ.13.50 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే గతంలో కేసీఆర్ సర్కారు ఇచ్చిన రూ.2 వేల పింఛన్ తప్ప పెంచిందేం లేదని తేలిపోయింది. ఒక రైతు భరోసా విషయంలో కూడా మరోసారి సర్కారు మోసం చేసింది. ఇప్పటికే రెండు సీజన్లుగా పెట్టుబడి సాయం లేదు. ఈసారైనా బడ్జెట్‌లో రైతు భరోసాకు ప్రత్యేక నిధులు ఉంటాయనుకుంటే అసలు ఆ ప్రస్తావనే బడ్జెట్‌లో రాలేదు. దీంతో పైలెట్ గ్రామాల్లో తప్ప మిగిలిన గ్రామాల్లోని రైతులకు రైతుభరోసా రూ.12 వేలు రావడంపైన నీలినీడలు కమ్ముకున్నాయి. ఇక రైతు రుణమాఫీ సగం మందికే ఇచ్చిన సర్కా మిగిలిన వారికి ఎగవేసినట్లేనని తేలిపోయింది. ఏ ఊరికి వెళ్లిన వంద శాతం రుణమాఫీ కాలేదు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తేనైనా రుణమాఫీ అవుతుందనుకుంటే అసలు విషయాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ముందేమో రుణమాఫీకి రూ.46 వేల కోట్లు అవుతుందన్నారు. క్యాబినెట్ మీటింగ్‌లో రూ.30 వేల కోట్లు చాలు అన్నారు. గత బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు పెడుతున్నట్లు చెప్పారు. తీరా రూ.20 వేల కోట్లతో రుణమాఫీ చేసినట్లు నిన్న బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అంటే సగానికి కంటే ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ ఇక కాదనే విషయం తేలిపోయిందని నిపుణులు అంటున్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఇస్తామన్న ఆరు గ్యారెంటీలను ఎగవేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై సబ్బండ వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

❖ రుణమాఫీ ఉత్తమాటేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులందరికీ రుణమాఫీ చేశామని చెప్పారు. అది పూర్తిగా అబద్ధం. మా ఆలూర్ గ్రామంలోనే నాతోపాటు వంద మందికి పైగా రైతులకు మాఫీ కాలేదు. ఈ బడ్జెట్‌లో కాని వారి కోసం కొత్తగా నిధులు కూడా కేటాయించలేదని తెలిసింది. అంటే ఈ ప్రభుత్వం మాకు మాఫీ చేయదని తేలిపోయింది. ఇది పూర్తిగా అబద్ధాల ప్రభుత్వం. మేం రైతులం కాదా? మేమేం పాపం చేసినం. మాకెందుకు మాఫీ చేయరు? నేను పీఏసీఎస్ ద్వారా రూ.1.70 లక్షల రుణం తీసుకున్న. మాఫీ లిస్టులో చివరి జాబితా వరకు చూసినం. ఏడు నెలల కింద గతేడాది ఆగస్టులో రుణమాఫీ చేయాలంటూ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన. అన్ని అర్హతలు ఉన్నా నాకెందుకు మాఫీ కాలేదని అప్పట్లో అధికారులను నిలదీస్తే పొంతన లేకుండా మాట్లాడిన్రు. రుణమాఫీ డబ్బులు విడుదల అయ్యాయి. కానీ.. ట్రెజరీలో పెండింగ్ ఉందని అప్పట్లో అధికారులు చెప్పారు. దీంతో త్వరలోనే మాఫీ అయితుందేమోనని ఎదురుచూసిన. ఇప్పటి వరకు కాలేదు. ఈ బడ్జెట్‌తో ఆశలు ఆవిరైనయ్. నాకు గ్రామంలో తొమ్మిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటి వరకు యాసంగికి సంబంధించి రైతు భరోసా డబ్బులు కూడా రూపాయి రాలేదు. గత వానకాలంలో సన్నరకం ధాన్యం 220 బస్తాల వరకు ప్రభుత్వానికి అమ్మిన. ఇందుకు సంబంధించి రూ.40 వేల వరకు బోనస్ డబ్బులు రావాలి. ఎప్పుడు వస్తాయో కనీసం చెప్పేవారు లేరు. రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.

- దేశెట్టి ప్రవీణ్, రైతు, ఆలూర్, సారంగాపూర్ మండలం

❖ రూ.2 లక్షల రుణమాఫీ కాలే..

నాకు రూ.2 లక్షల చిల్లర పంట రుణం ఉంది. గతంలో అందరికీ మాఫీ చేసినోళ్లు నాకు చేయలేదు. ఈసారి బడ్జెట్‌లో నిధులు ఇచ్చి నా మాదిరిగా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తారు అనుకున్నా. కానీ.. అసలు డబ్బులే ఇవ్వలేదని అంటున్నారు. ఇక నాకు రుణమాఫీ కాదని తేలిపోయింది. కాంగ్రెసోస్తే రూ.2 లక్షలు మాఫీ అవుతుంది అనుకున్నా. దానికి సవాలక్ష కొర్రీలు పెట్టి అసలు మాఫీ చేయకుండా వదిలేస్తారనుకో లేదు.

- అన్నమనేని సుధాకర్‌రావు, తాండూర్

❖ రూ.4 వేల పింఛన్ వచ్చేట్టు లేదు..

ప్రస్తుతం నాకు రూ.2వేల పింఛన్ వస్తుంది. కాంగ్రెస్ గెలిస్తే రూ.4వేలు ఇస్తామన్నరు. మళ్ల నిన్న, ఇవాళ అసలు మాకు నిధులేవో ఇయ్యలేదని బయట చెప్తున్నరు. ఇక రూ.2వేల పింఛనే ఇస్తరా? ముందు చెప్పినట్లు రూ.4వేల పింఛన్ రాదా? అనేది అర్థం కావడం లేదు. రూ.4 వేల పింఛన్ వస్తే ఖర్చులకు కొన్ని ఉంచుకుని, మిగిలిన పైసలతో ఆసుపత్రికి పోదామని ఆశగా చూస్తున్నా. ఇస్తరో ఇయ్యరో తెలుస్తలేదు. ఎన్నికల ముందు చెప్పినట్లు పింఛన్ రూ.4వేలు ఇస్తే బాగుంటది.

- ఇందారపు భీమయ్య, తాండూర్

❖ అటకెక్కించారు..

ఆరు గ్యారెంటీల అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడాన్ని అటకెక్కించింది. మహిళలకు రూ.2500, తులం బంగారం, ఆసరా పింఛన్ దారులకు 4 వేల పింఛన్, నిరుద్యోగ భృతి పథకాలకు నిధులు కేటాయించలేదు. అంటే ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత బడ్జెట్ రైతులు, పేదలు, మహిళలకు ప్రయోజనం చేకూర్చేలా లేదు. నిధుల కేటాయింపులో చిన్నచూపు చూసి ప్రతి రంగాన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది.

- రాళ్లబండి పోచం, కోటపల్లి

రైతులపై ఆంక్షలు

సాగుచేయవద్దంటూ పట్టాలున్న వారికి కూడా నోటీసులు

- అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో ఇంటి అవసరాలకు బోర్లు వేయడం కూడా నిషేధం
- ఆందోళనలో లుంబినగర్, పాపన్నపేట రైతులు, గిరిజనులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో అటవీ ప్రాంత గ్రామాల్లో పట్టా భూములున్న రైతులకు కూడా సాగుచేయవద్దంటూ అటవీ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. దాదాపు 40 ఏండ్ల నుంచి సాగులో ఉండి సుమారు 15 ఏళ్ల క్రితమే పట్టాలు పొందిన రైతులకు సైతం అటవీ అధికారులు నోటీసులు జారీచేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బెజ్జూర్ మండలంలోని లుంబినినగర్‌లో 32 మంది రైతులకు వారి సాగులో ఉన్న భూములకు 2012లో ప్రభుత్వం పట్టాలను జారీ చేసింది. వర్షాకాలం సాగుకు భూములను సిద్ధం చేసేందుకు పత్తి కట్టె తీసేందుకు వెళ్లిన 32 మంది రైతులకు ఇటీవల నోటీసులు జారీచేశారు. దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్ల యజమానులకు కూడా నోటీసులు అందజేశారు. ట్రాక్టర్లను సీజ్ చేస్తామని, వ్యవసాయ పనులు చేసే రైతులపై కేసులు పెడుతామని హెచ్చరికలు జారీ చేశారు. 40 ఏళ్లుగా సాగులో ఉన్న తమ భూములను అటవీ అధికారులు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

పై ఫొటోలో తమ పట్టాలను చూపిస్తున్న రైతులు కుమ్రం భీం ఆసిఫాబాద్ బెజ్జూర్ మండలంలోని లుంబినగర్ చెందినవారు. ఈ గ్రామంలో 69 మంది రైతులు ఉన్నారు. వీరిలో 32 మంది రైతులకు 2010 లో 120 ఎకరాలకు అప్పటి ప్రభుత్వం పట్టాలను జారీచేసింది. ఈ పట్టాల ఆధారంగా రైతులు బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందారు. 2015లో వీరి భూముల్లో ప్రభుత్వం 9 బోర్లను కూడా మంజూరు చేసి రైతులకు సామూహికంగా సాగునీరు అందించడంతో పంటలను సాగుచేసుకుంటున్నారు. అయితే ఈ భూములను సాగు చేయవద్దని, చేలల్లోకి వెళ్తే కేసులు పెడుతామని హెచ్చరిస్తూ అటవీ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్ల యజమానులకు సైతం నోటీసులు అధికారులు పంపించారని అన్నారు.

చేలల్లోకి వెళ్లవద్దంటూ అటవీ అధికారులు జారీచేసిన నోటీసు



చేలు దున్నేందుకు వెళ్లవద్దంటూ ట్రాక్టర్ యజమానులకు జారీ చేసిన నోటీసు

ఇండ్లలో సైతం బోర్లు వేయనీయడం లేదు

బెజ్జూర్ మండలంలోని పాపన్నపేటలో సుమారు 500 ఇండ్లు ఉన్నాయి. ఈ గ్రామంలో తాగునీటి అవసరాలకు సైతం ఇళ్లలో బోర్లు వేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. బోర్లు వేయరాదని డప్పుచాటింపులు సైతం చేశారని, సమావేశాలు నిర్వహించి హెచ్చరించారని గ్రామస్తులు తెలిపారు. అటవీ అధికారులు తమకు తాగేందుకు కూడా నీళ్లులేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్లకు ముందు ఏర్పడిన ఈ గ్రామాన్ని ఖాళీ చేయించాలని చూస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా అటవీ శాఖ నుంచి నోటీసులు జారీ చేసిన విషయం తన దృష్టికి రాలేదని, ఈ సమస్యపై రైతులు, గ్రామస్తులు కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. వారు దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తానని ఆయన తెలిపారు.

తాగునీటి కోసం బోర్లు వేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న పాపన్న పేట గ్రామస్తులు

చేలల్లో పనులు చేయవద్దని నోటీసులిచ్చిండ్రు..

మేము 40 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూముల్లో సాగు నిలిపివేయాలని అటవీ అధికారులు నోటీసులిచ్చారు. మా గ్రామంలో 32 మంది రైతులకు 2012 అప్పటి ప్రభుత్వం 120 ఎకరాలకు పట్టాలు ఇచ్చింది. మా భూముల్లో సాగునీటి కోసం 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం బోర్లను కూడా వేయడంతో పంటలను సాగుచేసుకుంటున్నాం. అయితే ఇటీవల మా చేలలోనికి పనులకు వెళ్లకూడదని, వర్షాకాలానికి భూములను సిద్ధం చేయవద్దని అధికారులు నోటీసులిచ్చారు. చేలలోకి వెళ్తే కేసులు పెడుతామని అంటున్నారు.

– వగాడి బురుజ, రైతు, లుంబినగర్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తులం బంగారం ఎప్పుడిస్తరు ?

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 20 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం పలువురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయంతో తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

దండేపల్లిలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 20 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగతాయన్నారు. మంచిర్యాల జిల్లాలో మొత్తం 9,198 మంది రెగ్యులర్ విద్యార్థులు , గతంలో ఫెయిల్ అయిన 221 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా సమయంలో పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్, జిరాక్స్ దుకాణాలు మూసివేసి ఉంచాలన్నారు. సందేహాలుంటే మంచిర్యాల జిల్లా కంట్రోల్ రూమ్ 7032463114 లేదా 94406 88034 లో సంప్రదించవచ్చని తెలిపారు.

రైతులు అధైర్యపడొద్దు

- కడెం కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం
- కలెక్టర్ కుమార్ దీపక్

మాకులపేట వద్ద వరి చేలను పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, మార్చి 20 : కడెం కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని, రైతులు అధైర్యపడొద్దని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ భరోసానిచ్చారు. దండేపల్లి మండలంలోని నాగసముద్రం, మాకులపేట గ్రామాల్లో వరి చేలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కడెం నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. పంటల స్థితిగతులపై వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. కడెం నీళ్లు చివరి ఆయకట్టు పంటలకు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు రైతులు విన్నవించగా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. వరి కాకుండా ఇతర పంటలు సాగు చేసి లాభాలు పొందాలని రైతులకు సూచించారు. ఒకటే పంట సాగుతో భూసారం దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. దండేపల్లిలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షల ఏర్పాట్లను ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఏవో అంజిత్‌కుమార్, ఆర్ఐ భూమన్న, ఏఈవో శ్రీకన్య, తదితరులున్నారు.